722118601

# ప్రబోధ 32

ఆస్తిక బుద్ధి పోయె మరియాదల ధర్మము రూపుమాసె బల్
నాస్తిక బుద్ధి హెచ్చె గురువన్నను శ్రద్ధయు పోయె భక్తికిన్
స్వస్తి సనాతన విద్యకు స్వస్తి వహించెడి కాలమయ్యెడిన్
నిస్తుల గౌరవాదరణ నేలకు కూలుచు వచ్చె విద్యలో
సద్విద్య చదివించి శాంతిని బోధించి
ధర్మంబు నేర్పెడి తండ్రి తండ్రి
సన్మార్గమును జూపి సౌఖ్యజీవన మిచ్చె
దైవభక్తిని తెల్పె తండ్రి తండ్రి
స్వార్జితంబునంత చక్కగా పంచిచ్చె
తత్త్వంబు గరపెడి తండ్రి తండ్రి
సత్కుమారుని చూచి తనలోన సంతృప్తి
పొందు మహనీయుడే తండ్రి తండ్రి
ఇట్టి తండ్రిని గన్నట్టి అమరసుతుడు
అంకింతబగు ఆత్మకు శంక లేక
యింత కన్నను వేరెట్టి ఎరుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా!
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా!

విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

స్థూల జగత్తుకు, జీవలోకానికి, మానసిక సీమకు, సాంఘిక జీవితానికి మూలాధారమై వున్న పరమ సత్యమునకు ప్రత్యక్ష స్వరూపమే విద్య. దివ్యమానవుని స్వరూప స్వభావములను, తీరు తెన్నులను విద్యాదర్పణము నందు మాత్రమే మనము చూడ గలుగుతాము. సత్యస్ఫూర్తికి, పదార్థముల యొక్క విచక్షణకు వున్న తేడాను నిరూపించునదే విద్య. సృష్టి యొక్క రూపురేఖలనే తీర్చిదిద్ది అన్నికాలములకు వర్తించే సత్యాన్ని దర్శింపచేయటమే విద్య యొక్క లక్ష్యము. విద్య మన సత్యాన్ని గుర్తించిన వ్యక్తి మాత్రమే సృష్టితో, సంఘముతో వ్యక్తి నుండి ఆవిర్భవించిన సమస్త శక్తులతో ఏకత్వాన్ని అనుభవించగలడు. ఈ అన్నింటి యం

దున్న సంబంధ బాంధవ్యాన్ని గుర్తింప జేసేదే విద్య. సృష్టియే మానవుడు బంధింప బడక సృష్టి అధికారియైన ఈశ్వరత్వాన్ని తనయందు ఆవిర్భవింప జేసుకునే మార్గమునకు అవకాశము కల్పించునదే విద్య. నైతిక పరివర్తనకంటె, ఆధ్యాత్మిక పరివర్తన అత్యంత ఉత్తమమైనదనే మూలాధారమైన సూత్రాన్ని నిరూపించునదే విద్య. యావత్ సృష్టిలో మానవులను కూడను, అందరిని కూడను యేకత్వముగా కట్టి వుంచే సమత్వమే విద్యయొక్క లక్ష్యము. సమాజము నందుండిన ఈశ్వరత్వాన్ని వ్యక్తిద్వారానే ఆవిర్భవింప జేసే సమత్వాన్ని గుర్తింప జేసేది విద్య. ప్రకృతి నుండి ఆత్మతత్వములో ప్రవేశించటము కాదు విద్యయొక్క బోధ. ఆత్మద్వారా మానవుడు ప్రకృతిలో ప్రవేశింప జేసేదే విద్యయొక్క లక్ష్యము. ప్రకృతి యొక్క చైతన్యము పూర్ణమైనది కానేరదు. ఈ ప్రకృతి యొక్క చైతన్యమును అహంకార సూత్రముతో కట్టినప్పుడే యిది వికృతత్వంగా మారుతుంది. ఆత్మతత్వముతో దీనిని బంధించినప్పుడే యిది సుకృతత్వంగా రూపొందుతుంది. వికృతికి సుకృతికి వుండిన తేడాలు నిరూపింప జేసేదే విద్య. కోరికల చేత మానవుని బంధింప జేసి తన యొక్క స్వాతంత్ర్యమును వ్యర్థముగావించేది విద్య కానేరదు. జాతి యొక్క సమత్వాన్ని, దేశము యొక్క సమగ్రతను కాపాడి దీని ప్రచార ప్రబోధల ద్వారా దేశమునకు శాంతి భద్రతలను అందించటమే విద్యయొక్క లక్ష్యము

ఇట్టి పవిత్రమైన విద్యలనుగరపి వారిని తిరిగి గృహస్థాశ్రమములో పంపించే సమయమందు వారికి యీ విధమైన బోధలు చేసి యీ ప్రాకృతమైన జీవితములో ప్రవేశించే సమయములో ఒక సమావేశము జరిపించి ఆ సమావేశములో వారు యున్నందు మెలగవలసిన, పవిత్రమైన మార్గములను, పవిత్రమైన భావములను అభివృద్ధి పరచుకొనే నిమిత్తము ఏర్పరచినదే స్నాతకోత్సవము.

ఈ గురుకులములో విద్యగరపే సమయములో తన యొక్క జీవితమును పవిత్రమైనదిగను, ప్రశాంతమైనదిగను, నిర్మలమైనదిగను, నిస్వార్థమైనదిగను తనత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. గృహస్థ, వానప్రస్థ, సన్యాసము అనే యీ మూడు ఆశ్రమములు కూడను యీ బ్రహ్మచర్య ఆశ్రమముపైనే ఆధారపడి వుంటున్నాయి. విద్యార్థి జీవితము పై మూడు ఆశ్రమములకు పునాది వంటిది. విద్యార్థులారా! విద్యా విషయమునందుగాని, వైజ్ఞానిక విషయమునందు గాని మీరు వెనుకబడిన మీ తల్లి యెంత వేదన పడుతుందో, నైతికముగా, ఆధ్యాత్మికముగా వెనుకబడిన బిడ్డలను చూచి అంతకు వేయిరెట్లు అధికముగా భారతమాత ఆవేదన చెందుతుంది. జననీ జన్మభూమి యొక్క శాంతి గోరి, భద్రతను గోరి, ఆవేదన నిర్మూలము చేసి, ఆనందమును ప్రాప్తింప జేసే బాధ్యత విద్యార్థులపైన వుంటున్నది. జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి అని యీ జనని, జన్మభూమి యీ రెండింటి యొక్క తత్వాన్ని చక్కగా గుర్తించుకున్న వ్యక్తియే

722118603

విద్యార్థి. ఈ సత్యాన్ని మీరు గుర్తించి మున్ముందు మీ జీవితాన్ని ప్రశాంతమైన ఆదర్శవంతమైన జీవితముగా అనుభవించాలని ఆశిస్తున్నాను.

విద్యార్థులారా! యీనాడు మీరు ఎవరిని పౌరులుగా విశ్వసిస్తున్నారో, ఎవరిని అధికారులుగా భావిస్తున్నారో, ఎవరిని యీ రాజకీయంగా కాని, ఆస్తికంగా కాని నాయకులుగా మీరు విశ్వసిస్తున్నారో వీరందరు కూడను ఒకనాటి విద్యార్థులే. ఈ నాటి విద్యార్థులే రేపటి పౌరులు, రేపటి అధికారులు, రేపటి నాయకులు. ఈ సత్యాన్ని మీరు మరువరాదు. దేశమంటే మానవులనే సత్యాన్ని గుర్తించాలి. దేశమును తీర్చిదిద్దటమంటే మానవులను తీర్చిదిద్దటమే. మానవులను తీర్చిదిద్దటమంటే యేమిటి? నైతికముగా, ధార్మికముగా వారిని సంస్కరింప జేయుటమే మన యొక్క ప్రధాన కర్తవ్యము. సంస్కరణ మనగా మనయందున్న, నిత్యజీవితములో వున్న దోషములను నిర్మూలము గావించి పవిత్రతను, సద్భావములను అభివృద్ధి గావించటమే సంస్కరణ. జీవితమంతయు కూడను సంస్కారముపైనే ఆధారపడి వుంటున్నది. పండించిన ధాన్యమును సంస్కరించకుండా భుజించుటకు వీలుకాదు. దానిని సంస్కరించటమనగా ధాన్యమును పైపొట్టును తీసి దానిని బియ్యముగా చేసి దానిని వండుకొని భుజించినప్పుడే దానికి సంస్కరణ యేర్పడుతుంది. పుట్టిన ప్రత్తిని కూడను అట్లే మనము ధరించుటకు వీలుకాదు. దానిని దారముగా చేసి, వస్త్రముగా సంస్కరింపు జేసి తదుపరియే మనము దానిని ధరించి యీ యొక్క చలి బాధనుండి దూరమవుతున్నాము. భూమిలో పుట్టిన మతక బంగారము కూడను సంస్కరించినప్పుడే అది అపరంజిగా రూపొందుతున్నది. కనుక సంస్కరణ మనగా మన నిత్య జీవితములో వుండిన దురభ్యాసములు, దుశ్చేష్టలు దుశ్చింతనలను దూరము గావించుకొని సద్భావములు, సదభిప్రాయములను, సత్ప్రవర్తనలను పోషించుకోటానికి ప్రయత్నించాలి. వ్యక్తి యొక్క విలువ సంస్కరణపైననే ఆధారపడి వుంటున్నది.

అయితే యీనాడు ఆర్థికముగా గాని, ఆధ్యాత్మికముగా కాని, నైతికముగా కాని ప్రజలను సంస్కరింప జేసే అధికారము ప్రభుత్వమునకు లేదు. లేక ప్రభుత్వమును సంస్కరింప జేసే శక్తి యుక్తులు ప్రజలలో లేదు. ఆధ్యాత్మిక దృష్టిలో చూచినప్పుడు యిటు ప్రభుత్వమునకు గానీ అటు ప్రజలకు గాని సంస్కరింప జేసే శక్తిసామర్థ్యములు లేకపోవటం చేతనే యీనాడు విద్యార్థులయందు యిట్టి పవిత్రమైన సంస్కరణ పోషించటానికి ప్రయత్నించి, అభివృద్ధి గావించటానికి తగిన కృషి సల్పాలి. ఇది బాల్యస్థితియందే, విద్యార్థి స్థితియందే తన యొక్క జీవితాన్ని చక్కగా మలుచుకోటానికి ప్రయత్నించాలి. భావి జీవితములో ఉత్తమమైన పౌరుడుగా వుత్తీర్ణుడు గావించుకునే నిమిత్తమై యీనాడు మనము చక్కని అభ్యాసముల చేత మన జీవితమును పోషించుకోటానికి ప్రయత్నించాలి. విద్యార్థులు భవనమునకు పునాది వంటివారు. వృక్షమునకు వేర్లు వంటివారు. కనుక యీ విద్యార్థి దశను మనము దుర్వినియోగ పరచకుండా పవిత్రమైన భావ

722118604

ముల చేత దీనిని అభివృద్ధి గావించినప్పుడే యీ శాంతి భవనము చేత జీవితమును ఆనందాన్ని అను
భవించటానికి వీలవుతుంది.

ఈనాడు సాంకేతిక విజ్ఞాన శాస్త్రము విరివిగా పెరుగుతూ వచ్చింది. కానీ
యిది ప్రజలకు అనేక విధములైన అనుకూలములను, సదుపాయములను చేకూరుస్తూ వచ్చింది.
అయితే ఎంత అనుకూలము, ఎంత ఉపకారము, ఎన్ని లాభముల పైన ఆధారపడి యుండెనో దాని
కి అనేక రెట్లు నష్టము, బాధలు, కొన్ని విధములైన దుఃఖములు పెరుగుతూ వస్తున్నవి. ఈ సాంకేతి
క విజ్ఞాన శాస్త్రము చేత వుపకారము కంటె అధికముగా అపకారమే పెరుగుతూ వస్తున్నది. ఈ
విజ్ఞాన శాస్త్రములో దోషము లేదు. కాని దీనిని వినియోగించుకునే విధానములో వివేకము శూన్య
ము కావటమే దీనికి కారణము. విజ్ఞానముతో పాటు వివేకము వుండినప్పుడే యీ విధమైన సాంకేతి
క శాస్త్రము సద్వినియోగ పరచుకోటానికి సాధ్యమవుతుంది. ఇది నవీన నాగరిక యుగము. అ
యితే యీ యుగము లోపల అనేక విధములైన కొన్ని అపశృతులు చేరటం చేత మానవత్వములో
పలవున్న దివ్యత్వాన్ని విస్మరింప చేస్తున్నది. ఈనాటి జీవితము కేవలము ఒకవిధమైన భోగముగా
అనగా సుఖసంతోషములలో తులతూగ వలెనని ఆశిస్తున్నాడు మానవుడు. కాని యీ తలంపునకు
విరుద్ధముగా అనుభవిస్తున్నాడు కష్టములను. అయితే దీనికి కారణమేమిటని మానవుడు గుర్తించు
కోటానికి తగిన ప్రయత్నం చేయటం లేదు. విలాస జీవితములో పడి తన జీవితమునంతయు
కూడను వ్యర్థము గావిస్తున్నాడు. నిత్య జీవితము యొక్క సరియైన విలువలను గుర్తించుకోలేక పోతు
న్నాడు. ఈనాటి యుగము యొక్క విచిత్రమైన విలువలు ఏమిటి? సినిమాలు, విమానాలు అధికమై
పోయాయి. రేడియోలు, వీడియోలు అధికమైపోయాయి. టెలిగ్రాములు, టెలిఫోనులు అధికమైపోయా
యి. ఈ విధమైన అనుకూలములు అధికము కావటం చేత మానవునికి విశ్రాంతిలేని మనసుగా
తయారౌతుంటాది. జీవన వ్యవసాయము విరివిగా పెరిగిపోతూ వస్తున్నది. యీ వ్యయమును
భరించుకోలేక మానవుడు అనేక విధములైన తికమకలతో తులతూగిపోతున్నాడు. ఒకవైపున
యుద్ధ భయము. మరొకవైపున కరవు కాటకముల భయము. ఈ అన్నింటికి మూలకారణము
విజ్ఞాన శాస్త్రమే. మానవుడు క్షణక్షణము కూడను భయ భ్రాంతులతో జీవితాన్ని గడుపుతూ వస్తు
న్నాడు. ఒంటరిగా యింటిలో వుండటము భయమే. బయటకు పోవటము భయమే. ఏ విధమై
న కార్యము చేయాలన్నా భయమే. భద్రత శూన్యమైపోయింది. ఆనందము అత్యంత దూరమైపో
యింది. నిరాశతో, నిస్పృహతో మానవుడు కృంగిపోయి కుళ్ళిపోతున్నాడు. దీనికంతకు మూలకార
ణము ఆర్థికముగా అనేక విధములుగా వ్యయము పెరిగిపోవటమే. తర్వాత మానవుడు అన్యాయ
అక్రమ, అనాచార, అసత్యముల చేత కొంతదారి తప్పి నడుస్తున్నాడు. ఈ అవినీతి పెరగటానికి
మూలకారణము యిదియే.

722118605

ఒక చిన్న ఉదాహరణము. మధ్యతరగతి ఉద్యోగిగాని, ఏగుమాస్తాగానో పని చేసే ఉద్యోగి యీ యెంక్కు దీనిని భరించలేకపోతున్నాడు. తమ బిడ్డలను కూడ చదివించుకోటానికి చాలా శ్రమ పడిపోతున్నాడు. మొదటి తరగతిలో ప్రవేశపెట్టాలంటే కొన్నివేలు వారికి సుంకము కట్టాలి. ఇంక డాక్టరో యింజినీరో చదివించాలనుకుంటే కొన్ని లక్షలు వ్యయము చేయాలి. ఇంతటితో తీరక ప్రక్కింటిలోపల రేడియోనో, వీడియోనో వుంటున్నది. అంటే యీ యింటిలో వున్న యిల్లాలుగాని, పిల్లలుగాని ఆ యజమానిని బాధిస్తూ వుంటారు. మనయింటికి కూడను ఒక రేడియో వీడియో కావాలని ఆశిస్తారు. ఈ వచ్చే జీతములోపల యీ రేడియో లు వీడియోలు తాను యేవిధముగా సంపాయించగలడు. ఈ సాంకేతిక విజ్ఞానము పెరిగిపోటం వలననే యీ విధముగా మారిపోతుండాది. అందువలననే యీ ఆలుబిడ్డలను సంతృప్తిపరచే నిమిత్తమై తాను అప్పు లేక లంచమో తీసుకోటం ప్రారంభమవుతున్నాది. ఈ అవినీతి మార్గములో ప్రవేశించటం చేత క్రమక్రమేణా యీ అవినీతి పెరిగిపోతూవస్తున్నది. జీతము తక్కువ యింటి ఖర్చులు యెక్కువ. భార్యాబిడ్డలను సంతోషపెట్టాలి. ఈ యజమానుడేమి చేస్తాడు. ఈ కారణముల చేత అవినీతిలో కాలిడుతున్నాడు. కనుక క్రమక్రమేణా యీ సాంకేతిక విజ్ఞాన శాస్త్రమనేది మానవుని పెడమార్గమును పట్టిస్తూ వుంటున్నాది

ఒక student MBBS చేశాడనుకోండి. లేక BE పాస్ చేశాడనుకోండి ఆ తల్లితండ్రులు ఎంతో శ్రమపడి యితనిని చదివిస్తూ వచ్చారు. ఉద్యోగమో లేక ప్రాక్టీసు చెయ్యాలి. ఈ ఉద్యోగమూ చిక్కటంలేదు. ప్రాక్టీసు చేసుకోవాలంటే యీ కలియుగములోపల ఆడంబరము అధికముగా చూపించాలి. ఏ బ్యాంకులోనో లోను తీసుకుని కారు కొనాలి. లేకపోతే మోటారుసైకిలు కొనాలి. ఇంటిలో పస్తులుండినా కాని యీ డాక్టరు, యీ లాయరు వీళ్లంతా కూడను బజార్లో కార్లలో ప్రయాణం చెయ్యాలి. ఈ ఖర్చులు భరించాలంటే వీరు యేమి చెయ్యాలి. ఈ మార్గమును అనుసరించే వారు నీతినియమాలను తప్పినడుస్తూ వస్తున్నారు. ఏదైనా ఒక పేషంటుకు దగ్గుపడిశము పట్టింది. వానికి తక్షణమే రెండే గాని రెండు మాత్రలైతే యిది నయమైపోతుంది. కాని యీ పేషంటుకు త్వరలో నయమైపోతే డాక్టరుకేమాత్రము ధనము చేరదు. రెండు దినాలలో జబ్బును నయము చేయవలసిన యీరోగి ఒక వారము రోజులు వాడి పెంచుతారు. ఈ విధముగా వానిని రోగిష్టిగా పెంచకపోతే యీ డాక్టరు కడుపు నిండదు. అందుకోసమనే చెప్పారు ఆంధ్రలోపల. పక్కింట్లో ఘొల్లుమంటే డాక్టరు చేతిలో ఘల్లుమంటుందట. ఇంక లాయర్లు యేవిధముగా వుంటుంటారంటే యేదో చిన్న accident జరిగింది. దానికి వానికి రెండు రూపాయలు ఫైను వేస్తే అంతటితో తీరిపోతుంది. ఆ చిన్న కేసును సంవత్సరముల కొద్దీ దానిని జరుపుతూ

వస్తుంటారు. ఆ విధముగా కాలమే వీరు గడపకపోతే వీరికి ఫీజు రాదు. కనుక సాంకేతిక విజ్ఞానము నందు యే విధమైన యిబ్బందులు అభివృద్ధి అవుతున్నాయో మీరు యోచించుకోవచ్చును. మానవునియందు నీతి నిజాయితీలు శూన్యమైపోతున్నాయి. ఈ నీతి నిజాయితీ లేకపోతే మానవుడే కాదు. కనుక నేటి విద్యార్థులందరు కూడను యీ సత్యాన్ని గుర్తించి భవిష్యత్తులో అనుకూలవంతమైనదిగనూ, ఆనందాన్ని అందించేవారుగను, నీతి నిజాయితీలతో జీవితాన్ని గడపాలని ఆశిస్తున్నాను.

కనుక ఉద్యోగము నిమిత్తమై విద్యను నేర్చుకుంటున్నామనే భావాన్ని మీరు దూరము చేసుకోండి. జ్ఞాన సముపార్జన నిమిత్తమై మేము చదువుతున్నామనే సత్యాన్ని గుర్తించండి. మన జీవితము ఒక పరోపకార సంబంధమైన దానిలో ప్రవేశపెట్టాలి. సోదర మానవులను ప్రేమతో చూడాలి. ఈ స్నాతకోత్సవము నందు గురువుల బోధనలు యివే. మిమ్ములను కనిపెంచి అభివృద్ధిగావించిన తల్లితండ్రులను ప్రేమించాలి. తాము పస్తుండి పిల్లలు అభివృద్ధిలోకి రావాలని యెంత మంది తల్లి తండ్రులు ఎన్నో అవస్థలకు గురౌతున్నారు. కనుక మొట్టమొదట మాతృదేవో భవ మాతాపితరులనే దైవముగా భావించుచూ వారిని సంతోషపెట్టుటకు తగిన కృషి చెయ్యండి. పరులు గౌరవించ దగిన కర్మలే మనము పాటించాలి. పరులు చూచి మనము సిగ్గుపడే పనులలో ప్రవేశించరాదు. పెద్దలను గౌరవించాలి. దేశమును ప్రేమించాలి. ఈ విధమైన సుబోధనల నందుకొని యీ గురువుల ఆశ్రమముల నుండి, వారి వియోగము భరించుకొనలేక విచారములో వారి గృహములు చేరేవారు ఆనాటి విద్యార్థులు. ఆనాటి స్నాతకోత్సవములు అతి మధురమైన జీవితాన్ని గరపించి తమ యొక్క జీవితము లోపల యే ఆదర్శము నందుకోవాలనే మార్గము చేత విడువలేక విడువలేక వియోగ బాధతో కృంగిపోయేవారు. సంయోగ వియోగ సంకర్షణాత్మకమైన మహోత్తాల తరంగమై జీవితమనే సత్యాన్ని ఆయొక్క వియోగ సమయములో గుర్తించుకోటానికి ప్రయత్నించేవారు. వారి సుబోధలన్నియు కూడను సువర్ణాక్షరములతో హృదయమునందు లిఖించుకొని, శిరస్సునందు ధరించుకొని అతి వినయ విశ్వాసముల చేత గౌరవించేవారు విద్యార్థులు.

కానీ యీనాటి స్నాతకోత్సవములన్నీ కూడను అల్లర్లతో ఒకవిధమైన అసభ్యమైన ప్రవర్తనల చేత, అవిశ్వాసముల చేత అరాచకమైన మార్గములో ప్రవేశపెడుతున్నారు.

పాప భీతి లేని పామరత్వము బట్టి
దైవ ప్రీతి లేని దాని బట్టి
మానవత్వమడగె మానవులందున
విశ్వశాంతికిదియె విప్లవంబు.

పాపభీతి, దైవప్రీతి రెండూ లేకపోతే విశ్వమనేది విప్లవంగా తయారౌతుంది. అరాజకముగా రూపొందుతుంది. దైవప్రీతి, పాపభీతి మన యొక్క నేత్రములు. ఈ రెండు నేత్రములు లేకపోతే మనము అంధులమై పోతాము. అజ్ఞానులమై పోతాము. ఎంత విద్య చదివినవాడైనా కాని కేవలము మూర్ఖుడుగా రూపొందుతాడు.

పవిత్రమైన గుణముల చేత తన జీవితమును ప్రకాశింప జేసుకొని, పరులకు వుపకారమైన రీతిగా కాలము గడిపే వ్యక్తి కంటికి కానరావటం లేదు. ఈ సత్యవర్తన, శాంతి, ధర్మము యీగుణముల చేత వర్ధిల్లే విద్యార్థులుగా మీరు తయారు కావాలి. కేవలము విదేశ సంస్కృతులనుగాని, విదేశ అనుకరణనుగాని మనము యేమాత్రము పాటించరాదు.

భరతశాస్త్రమను బంగారు మనకుండ
పరశాస్త్రముల యెడ భక్తియేల?
కోరిన ఫలమిచ్చు కల్పవృక్షంబుండ
పెరటి పుష్పమునకై ప్రీతియేల?
అడిగిన పాలిచ్చు కామధేనువెరాగ
ధనమిచ్చు ఆవును కొనగనేల?
మండెడు కాంతితో మేరుపర్వతముండ
వెండి బంగారులకై వెదుకనేల?
భక్తి, ~~భుక్తి~~, ముక్తి నిచ్చెడి పరమాత్మనేనుండ
పాడు చదువులనెల్ల కోరనేల?

భారతీయులయొక్క శాస్త్రములు మహాపవిత్రమైనవి. దివ్యమైనవి. ప్రశాంతమైనవి. ఇలాంటి విలువైన బంగారు మనకున్నప్పుడు పరుల దానికోసం మనమెందుకు ఆశించాలి. చదువులయందు వుండిన సారము వినయ విధేయతలు. విద్యార్థియందు వినయమే లేకపోతే వాడు విద్యార్థిరూపుకాదు. కేవలము మూర్ఖుడుగా తయారౌతాడు. కనుక మనవిద్యార్థులంతా కూడను ఆదర్శమైన విద్యార్థులుగా ఆనంద జీవితాన్ని గడపి, సుఖశాంతుల చేత యితరులకు సుఖశాంతుల నందిచ్చే వ్యక్తులుగా రూపొందాలి.

విద్యార్థులారా! మన విద్యాసంస్థలందు ప్రధానమైనది క్రమశిక్షణ అన్నాము. ఈ క్రమశిక్షణ అనేది కేవలము విద్యాసంస్థయందు విద్యనభ్యసించునంత కాలము కాదు. మీరు ఎక్కడికి పోయినప్పటికి మీనీడ మిమ్ములను వెంటాడినట్లుగా క్రమశిక్షణ మీవెంట వెంటాడాలి. ఈ క్రమశిక్షణ లేకపోతే మానవుడు పశువుగా మారతాడు

7 22118608

పశుపతిగా మారాలిగాని పశువుగా కాదు. ప్రపంచములో యిన్ని విశ్వవిద్యాలయము లున్నప్పటికి మనము యింకో విశ్వవిద్యాలయము స్థాపించుటలో వుండిన అంతరార్థమును మీరు గుర్తించాలి. కేవలము విద్యను మాత్రమే అభ్యసించుటము కాదు. విద్యతో బాటు వినయ విధేయతలను వివేక విజ్ఞానములను పోషించుటానికి, దేశానికి తగిన వీరులుగా తయారు చెయ్యాలనే మా వుద్దేశ్యము. అలాంటి విద్యార్థులు తయారు కావాలని ఆనాటినుండి నేటివరకు కూడను నేను ఎదురు చూస్తున్నాను.

వెతుకుచున్నాను నేను వెతుకుచునే యున్నాను
వెతుకుచుంటి నాడు నేడు నిజమానవ విద్యార్థిని. ॥వె॥
కొదువ లేదు నరులకు నన్నూరు కోట్లున్నారు
నరరూపములె జూచితి నిజరూపము కాంచనైతి ॥వె॥
బూరుగ కాయలు చూచి మామిడి యని భ్రమసినట్లు
వెల్లి చెరకును చూచి చెఱకని లోనమలినట్లు ॥వె॥
కనికి రాళ్లరూపము జూచి కలకండని భ్రమసినట్లు
రూపు చూసి మోసపోకు గుణమే యిది నరుని రూపు ॥వె॥.

కేవలము ఆకారము మానవుడు కాదు మనకు కావలసినది. గుణమానవుడు కావాలి మనకు. కనుక గుణాన్ని పెంచుకునే విద్యార్థులుగా తయారు కావాలని ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

విద్యార్థులారా! విద్యార్థి యొక్క తత్వాన్ని మనము ఎంతనో అర్థము చేసుకోవాలి. ఈ అర్థము చేసుకున్న దానిని ఆచరణలో పెట్టాలి. ఈ ఆచరణలో పెట్టిన దానిని హృదయానికి హత్తుకునేటట్లుగా అనుభవించాలి. అనుభవించిన ఆనందమునే పరులకు అందించాలి. కనుక మనము మితిమీరిన కోరికల చేత మతులు చెడకొట్టుకొనుటకు ప్రయత్నించరాదు. కనుక మన కోరికలను అదుపులో నుంచుకొని అవసరమైన దానినే పెంచుకొని, దుర్గుణములను దూరము చేసి సద్గుణముల చేత మొట్టమొదట మీ యింటిని మీరు సరిదిద్దుకోవాలి. తల్లితండ్రులను ప్రసన్నులనుగావించుకోండి. తల్లితండ్రులకు మీరు దుఃఖము నిస్తిరా మీ జీవితము పూర్తి దుఃఖములోనే మునిగిపోతుంది. ఈనాడు తల్లితండ్రులకు యెంత ఆనందాన్ని అందిస్తారో రేపటిదినము నీ బిడ్డలు నిన్ను అంత ఆనందపరుస్తారు. కానీ యీనాటి విద్యార్థులు మేము విద్యార్థులమనే అహంకారము చేత తల్లితండ్రులను లక్ష్యము చేయుటము లేదు. కనుక మాతృదేవోభవ, పితృదేవోభవ ఆచార్యదేవోభవ యీ నాల్గింటిని మాత్రము శ్రద్ధగా ఆచరించి ఆనందించి దేశానికి యీ ఆదర్శమును అందించాలని నేను ఆశిస్తున్నాను.